క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో విద్యుత్ నిర్వహణ పనులు చేపట్టనుండడంతో పలుచోట్ల సరఫరాకు శుక్రవారం అంతరాయం కలగనుంది. 33/11 కేవీ పైనాపిల్ కాలనీ ఎస్‌ఎస్‌లో అంబేడ్కనగర్, దుర్గానగర్ 11 కేవీల పరిధిలో ఫీడర్ల నిర్వహణ జరగనుంది. దీంతో ఆయా ఫీడర్ల పరిధిలో ఉన్న పైనాపిల్ కాలనీ, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, కామాక్షినగర్, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ఆరిలోవ కాలనీ, ప్రగతినగర్, ఆపరేషన్ కాలనీ, పాండురంగాపురం, జైభీంనగర్, కనకమహాలక్ష్మినగర్, శ్రీకాంత్‌నగర్, లక్ష్మీనగర్, సాయినగర్, శివాజీనగర్, పోలీస్ స్టేషన్, నెహ్రూనగర్, లీలాసుందరయ్యనగర్ ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కృష్ణా కళాశాల విద్యార్థుల స్వచ్ఛభారత్



కృష్ణా కళాశాలలో శుభ్రం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం విద్యార్థులు గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–3, 4 ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణతో పాటు రెల్లివీధిలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. వీధులను శుభ్రం చేశారు. ప్రజల్లో చైతన్యానికి ప్లకార్డులతో ప్రదర్శన చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతకు స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ అధికారులు పోలా ఉమామహేశ్వరరావు, సుధీర్, రత్నభారతి, సామ్యూల్ డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

కృష్ణమూర్తికి నివాళి

ఆరిలోవ: సీపీఎం నాయకుడు వి.కృష్ణమూర్తి మృతి పట్ల ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు సంతాపం వ్యక్తం చేశారు. ఆరిలోవలో స్థానిక నాయకులతో కలసి గురువారం ఆయన కృష్ణమూర్తి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న సేవా స్ఫూర్తి సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు రవీంద్రనగర్ ఆఖరి బస్ స్టాప్ వద్ద సేవా స్ఫూర్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. కూలింగ్ మిషన్ ద్వారా చల్లటి తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. ఎండల తీవ్రత తగ్గే వరకు చల్లని నీరు, మజ్జిగ సరఫరా చేస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు ఒమ్మి అప్పలరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కాకి, గంగరాజు, స్థానిక పెద్దలు శ్రీనివాసరావు, పాత్రుడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మర్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు రోజుల కిందట ఒక వ్యక్తిని ద్విచక్రవాహనంపై వస్తున్న యువకులు ఢీకొనడంతో గాయపడిన సంఘటన ఐదో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో చేటుకున్న విషయం తెలిసిందే. గాయపడిన చప్పా దేముడు(45) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఈ నెల 20న బర్మాక్యాంప్ ఏఎస్‌ఆర్ నగర్‌కు చెందిన చప్పా దేముడు తన కుమార్తెతో నడుచుకుంటూ వెళ్తుండగా మురళీనగర్ మసీద్ వద్ద ముగ్గురు యువకులు బైక్‌పై వస్తూ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుమార్తె అనురాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చురుగ్గా ఆధునికీకరణ పనులు

- ఏయూ ఆర్ట్స్ కళాశాలలో మరుగుదొడ్ల అభివృద్ధి
- మూడు అంతస్తుల్లో పూర్తిగా మార్పు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చేపట్టిన ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆర్ట్స్ కళాశాల భవనంలో మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేస్తున్నారు. భవనం మూడు అంతస్తుల్లో ఉన్న టాయిలెట్స్ బ్లాక్‌లను పూర్తిస్థాయిలో మార్పు చేస్తున్నారు. భవనానికి రెండు వైపులా టాయిలెట్ బ్లాక్స్ ఉన్నాయి. తొలుత ఒకవైపు ఉన్న బాయ్స్ టాయిలెట్స్ బ్లాక్‌లకు మరమ్మతులు చేపడుతున్నారు. ఇప్పటికే రెండు అంతస్తుల్లో పనులు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. మూడో అంతస్తులో పనులు ప్రస్తుతం సాగుతున్నాయి.

- ఇటీవల ఆర్ట్స్ కళాశాల భవనాన్ని సందర్శించిన వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి దృష్టికి మరుగుదొడ్ల సమస్య వచ్చింది. వెంటనే వర్సిటీ చీఫ్ ఇంజినీర్‌ను పిలిచి, పూర్తి స్థాయిలో ఆధునికీకరించాలని సూచించారు. ఈ మేరకు ఒక్కో అంతస్తులో టాయిలెట్స్‌ను మార్పుచేస్తూ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేస్తున్నారు.
- భవనం లోపలి భాగం సీలింగ్‌తో సహా ప్లాస్టింగ్ చేసి, కాన్సెప్ట్ టైల్స్ బిగిస్తున్నారు. రెండు వాష్ బేసిన్‌లు, హైడ్రాలిక్ డోర్ ఏర్పాటు చేశారు. భవనం పైఅంతస్తులో శిథిలమైన వాటర్ ట్యాంక్‌లను తొలగించి, కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. పైఅంతస్తులో దెబ్బతిని లీక్ అవుతున్న భాగాన్ని పూర్తిగా పై పొర తొలగించి, వాటర్ ప్రూఫ్ కాంక్రీట్‌తో కొత్తగా నిర్మించారు. దీనికి పైభాగంలో మరో పూత వేసి నీరు లీక్ అవకుండా చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైన నీటి పైపులు ఏర్పాటు చేశారు. అదే సమయంలో భవనం చుట్టూ దెబ్బతిన్న భాగాలను గుర్తించి ప్లాస్టింగ్ చేశారు.
- భవనానికి మరో వైపున ఉన్న విద్యార్థినుల టాయిలెట్స్ బ్లాక్‌లను సైతం పూర్తిస్థాయిలో మార్పుచేసే దిశగా ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. వేసవి సెలవుల సమయంలో వీటి నిర్మాణం పూర్తి చేయడానికి నిర్ణయించారు. విభాగాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పనలో రాజీ పడకుండా వర్సిటీ అధికారులు విద్యార్థులకు పూర్తి స్థాయిలో వసతుల కల్పన చేపడుతున్నారు.



పైఅంతస్తులో పూర్తయిన రూఫ్ టాప్ ట్రీట్‌మెంట్



ఆధునికీకరించిన టాయిలెట్స్



సాగుతున్న అభివృద్ధి పనులు

జగనన్నతోనే పేదలకు ఉన్నత విద్య

బీచ్ రోడ్డు: అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాల ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. గురువారం జీవీఎంసీ 28వ వార్డులోని రామ్‌నగర్, నెహ్రూనగర్ ప్రాంతాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. గత ప్రభుత్వాలకు జగనన్న ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, సచివాలయం సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



పథకాల కోసం వివరిస్తున్న అక్కరమాని విజయనిర్మల

'జగనన్నే మా భవిష్యత్తు' ముగింపు ర్యాలీ రేపు

ఎంవీపీ కాలనీ: జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గ పరిధిలో శనివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు పార్టీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో గురువారం ఎంవీపీ కాలనీలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఆయా కార్యక్రమాల్లో భాగస్వాములైన కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. బైక్ ర్యాలీలో కూడా అందరూ భాగస్వాములు కావాలన్నారు. పెదగదిలి సెంటర్ నుంచి బీచ్‌రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం వరకు ఈ ర్యాలీ జరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న అక్కరమాని విజయనిర్మల

కైలాసగిరి కూడలిలో సూచీ బోర్డులేవి?

ఆరిలోవ: నగరంలో ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరి కొండపైకి వెళ్లడానికి సూచీ బోర్డులు లేకపోవడంతో దారి తెలియక సందర్శకులు ఇబ్బందిపడుతున్నారు. కై లాసగిరి కొండపైకి వెళ్లడానికి ఓ ఘాట్ రోడ్డు మార్గంతో పాటు రెండుచోట్ల మెట్లు మార్గాలున్నాయి. దీంతో పాటు రోప్‌వే అందుబాటులో ఉంది. ఘాట్ రోడ్డులో వాహనాలపై వెళ్లే సందర్శకులు విశాలాక్షినగర్‌లో కై లాసగిరి కూడలి వద్ద ఎటు నుంచి కొండపైకి చేరుకోవాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ కార్యాలయం ముందు ఈ కూడలి ఉంది. నాలుగు రోడ్లతో ఉన్న ఈ కూడలి నుంచి ఓ వైపు జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు, మరో పక్క హనుమంతవాక రోడ్డు, ఇంకో వైపు కైలాసగిరి కొండపైకి, మరోలైన్ విశాలాక్షినగర్ కాలనీ లోపలకు వెళ్లవచ్చు. ఎక్కువగా కై లాసగిరి కొండపైకి వెళ్లడానికి బీచ్‌రోడ్డులో తెన్నేటి పార్కు మీదుగా, జాతీయ రహదారి మీదుగా హనుమతంవాక నుంచి ఈ కూడలికి సందర్శకులు వస్తుంటారు. వారు ఈ కూడలి వద్దకు వచ్చి ఎటు వెళ్లాలో తెలియక ఎక్కువ మంది వేర్వేరు మార్గాల్లోకి వెళ్లిపోతున్నారు. రాంగ్‌రూటుకు వెళ్లి అక్కడ ఎవరెవరినో అడిగి తిరిగి కొండపైకి చేరుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులు దీనిపై దృష్టిపెట్టి ఇక్కడ కూడలిలో నాలుగు వైపుల నుంచి కై లాసగిరికి వెళ్లే మార్గాన్ని చూపుతూ సూచీ బోర్డులు ఏర్పాటు చేయాలని సందర్శకులు కోరుతున్నారు.



బోర్డు లేని కైలాసగిరి కూడలి

ముగిసిన ముత్యమాంబ అమ్మవారి జాతర

కంచరపాలెం: స్థానిక కూడలిలో వెలసిన ముత్యమాంబ అమ్మవారి వార్షిక నవరాత్రి జాతర మహోత్సవాలు గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా ముగిశాయి. అమ్మవారిని శాకాంబరీగా అలంకరించారు. వేకువజాము నుంచే అమ్మవారికి విశేషపూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ముత్యమాంబను దర్శించుకున్నారు.



శాకాంబరీ అవతారంలో ముత్యమాంబ

ఉన్నత చదువులకు తోడ్పాటు: ఎమ్మెల్సీ వంశీకృష్ణ

విశాఖ విద్య: విద్యార్థుల ఉన్నత చదువులకు తోడ్పాటు అందిస్తామని ఎమ్మెల్సీ, ఎస్‌వీకే కళాశాల చైర్మన్ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఇంటర్మీడియెట్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం కాలేజీ ప్రాంగణంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపకులను ఎమ్మెల్సీ ప్రత్యేకంగా అభినందించారు. ఆయన మాట్లాడుతూ మొదటి సంవత్సరం ఎంపీసీలో జుట్టు కావ్య 470కు 462 మార్కులు, కార్తికేయ 458, లలిత 452 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకులను కైవసం చేసుకున్నారన్నారు. కళాశాల విద్యార్థులు ప్రసాద్, 447, మౌనిక 446, సాయి లక్ష్మి 442, స్వాతి 440, చరణ్ 439, దినేష్ 429, హైమ 419, భారతి 419 మార్కులు సాధించి విశాఖ జిల్లాలో టాప్‌గా నిలిచారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు ప్రసాద్, కామేశ్వరరావు, మధు, పద్మ, చైతన్య, నవీన్, శేషగిరి, తరుణ్, ఇంద్ర, ప్రియ, లక్ష్మి పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ

ఉచిత ఆయుర్వేద యోగా శిబిరం రేపు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బీచ్‌రోడ్డులోని యోగా కేంద్రంలో ఈ శిబిరం నిర్వహించనున్నామన్నారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ కె.ఈశ్వరకుమార్ రోగులను పరీక్షించి చికిత్స అందిస్తారని తెలిపారు. తీవ్ర అనారోగ్యం కలిగిన వారు సంబంధిత రిపోర్టులు తీసుకురావాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం 94401 91673, 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పైప్‌లైన్ పగిలి.. తాగునీరు వృథా

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ కూడలి నుంచి ఇండస్ట్రియల్ ఎస్టేట్ వెళ్లే బీఆర్‌టీఎస్ సబ్‌వే రహదారిలో గురువారం రాత్రి తాటిపూడి పైప్‌లైన్ పగిలిపోవడంతో మంచినీరు వృథాగా పోతోంది. లీకేజీ నుంచి భారీగా నీరు ప్రవహించడంతో భవానీగార్డెన్, సుంకరపేట సమీప కాలనీలు, రోడ్లు, డ్రైనేజీలు నీట మునిగాయి. బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారిలో అడుగులోతు నీరు ప్రవహించడంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఐటీఐ జంక్షన్ బీఆర్‌టీఎస్ దారిలో పగిలిన పైప్‌లైన్ నుంచి వృథాగా పోతున్న తాగునీరు

ప్రేమ పేరిట మోసంపై యువతి ఫిర్యాదు

బీచ్ రోడ్డు: ఓ వ్యక్తి తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడని ఓ యువతి గురువారం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ యువతి, యువకుడు గత ఏడాది కాలంగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా దగ్గరయ్యాడు. ఇప్పుడు తనకు ఇప్పటికే వేరే అమ్మాయితో పెళ్లి అయిపోయిందని చెప్పడంతో యువకుడు చెప్పడంతో మోసపోయానని తెలుసుకున్న బాధిత యువతీ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యా సమాచారమ్

మరో చైర్ ప్రొఫెసర్ ఏర్పాటు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ పూర్వ విద్యార్థి, ఐఐటీ ఢిల్లీ పూర్వ సంచాలకుడు వి.ఎస్.రాజు గురువారం వర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో మర్యాద పూర్వకంగా కార్యాలయంలో భేటీ అయ్యారు. వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవాలను రెండు వారాల పాటు నిర్వహించడంపై ఆనందం వ్యక్తం చేశారు. తాను చదువుకున్న సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో మూడు సంవత్సరాల కాలానికి ఒక చైర్ ప్రొఫెసర్ ఏర్పాటు చేయాలని వీసీని రాజు కోరారు. విభాగంలో మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలల ఆధునికీకరణకు సహకారం అందిస్తానన్నారు. అనంతరం సివిల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులనుద్దేశించి ఆయన ప్రత్యేక ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సత్యనారాయణ రెడ్డి, డీఎస్‌టీ పూర్వ శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆర్.ప్రసాదరాజు, ఆచార్య కె.రాజగోపాల్, వై.వి.రాజు తదితరులు పాల్గొన్నారు.



వి.ఎస్.రాజును సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై పోస్టర్ విడుదల

ఏయూ క్యాంపస్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు మద్దతు పలకండి అన్న నినాదంతో బాల వికాస్ ఫౌండేషన్ సంస్థ రూపొందించిన పోస్టర్‌ను గురువారం ఏయూ జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సి.ఎం.వినయ్‌కుమార్, ఆచార్య డి.వి.ఆర్.మూర్తి, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు జర్నలిజం విభాగంలో విడుదల చేశారు. ఈ నెల 30న జాతీయ బాల కార్మిక దినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆచార్య వినయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యపడుతుందన్నారు. నరవ మాట్లాడుతూ నిర్బంధ విద్యా హక్కు చట్టం పూర్తి స్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 30న పాఠశాలలు, బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ పోస్టర్‌ను అతికిస్తామని ఆయన తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆచార్య వినయ్‌కుమార్, ఆచార్య డి.వి.ఆర్.మూర్తి, తదితరులు

పరీక్ష కేంద్రం తనిఖీ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూ ఎస్ఐబీ)లో జరుగుతున్న మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలను రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ గురువారం ఉదయం తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన వసతులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలను నిర్వహించడంపై అధికారులను అభినందించారు. అనంతరం ఏయూ సిబ్‌లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని పరిశీలించి, అక్కడ ఉన్న పుస్తకాలను తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్ ఏడో డాక్టర్ సారాబంది, తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్

వర్సిటీ అభివృద్ధిపై హర్షం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం(ఆంధ్రప్రదేశ్) ఉపకులపతి ఆచార్య టి.వి.కట్టమణి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు.

ఏయూ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఏయూలో గత నాలుగు సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వీసీ వివరించారు. ఏయూలో ప్రగతిపై కట్టమణి హర్షం వ్యక్తం చేశారు.

తల్లిదండ్రుల సమక్షంలో నేడు నియామక పత్రాలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. శుక్రవారం ఉదయం బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఏయూ సైన్స్ కళాశాలలో ఆఖరి సంవత్సరం విద్యార్థుల్లో 90 శాతానికి పైగా ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో నియామక పత్రాలు అందించే బృహత్తర కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులను వేదికపై సన్మానించి వారి సమక్షంలోనే విద్యార్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. పలువురు విద్యార్థులు నెలకు లక్ష రూపాయలకు పైగా వేతనాలతో ఉద్యోగాలు సాధించారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు.

మరింత మెరుగ్గా ఏయూ గ్రంథాలయ సేవలు

- వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- నూతన సాఫ్ట్‌వేర్ సోల్ 3.0 ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని డాక్టర్ వీఎస్ కృష్ణ గ్రంథాలయ సేవలు మరింత సరళతరం, సులభతరం చేయడం లక్ష్యంగా పని చేస్తున్నామని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. గురువారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో గ్రంథాలయంలో వినియోగానికి నూతనంగా అందుబాటులోకి వచ్చిన సోల్ 3.0 వెర్షన్ సాఫ్ట్‌వేర్‌ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు, పరిశోధకులకు, ఆచార్యులకు మరింత ఉపయుక్తంగా గ్రంథాలయ సేవలు ఉండే విధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. యూజర్ ఫ్రెండ్లీగా గ్రంథాలయం మార్పు చేయాలన్నారు. రానున్న రెండు నెలల్లో గ్రంథాలయాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకీకరించి, మెరుగైన సేవలు అందించే దిశగా సిద్ధం చేస్తామన్నారు.

తాళపత్రాల డిజిటలైజేషన్, శోధ్‌గంగలో 8వ స్థానం సాధించడం వర్సిటీ ప్రతిష్టను జాతీయ స్థాయిలో పెంచాయన్నారు.

ఇందుకు కృషి చేసిన గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. చరిత్ర, ఆర్కియాలజీ విభాగాలలో ఉన్న మరికొన్ని తాళపత్రాలను సైతం గ్రంథాలయం తీసుకుని డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. గ్రంథాలయానికి 100 కొత్త కంపూటర్లను సైతం అందిస్తామన్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను అందించిన ఘనత ఏయూ గ్రంథాలయానికి ఉందని, తిరిగి అటువంటి వ్యక్తులను తయారు చేసే దిశగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు, అకడమిక్ డీన్ ఆచార్య కిషోర్‌బాబు, ప్రిన్సిపాళ్లు ఆచార్య జి.శశిభూషణరావు, టి.శోభశ్రీ, వి.విజయలక్ష్మి, ఎస్.కె.భట్టి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సోల్ 3.0ని ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

ఛాతీ ఆస్పత్రిలో ఎక్స్‌రే యూనిట్ ప్రారంభం

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి రేడియాలజీ విభాగంలో నూతన ఎక్స్‌రే యూనిట్‌ను మిచిగన్ యూనివర్సిటీ వైద్యులు డాక్టర్ సురేష్ అన్నె గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 300 ఎంఎం సామర్థ్యం కలిగిన ఎక్స్‌రే యంత్రంతో రోగులకు మరింత మెరుగైన సేవలు లభిస్తాయన్నారు. ఆంధ్ర మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం రూ.25 లక్షల వ్యయంతో ఈ యంత్రాన్ని సమకూర్చింది. కార్యక్రమంలో డాక్టర్ రవీంద్రబాబు, డాక్టర్ సుబ్బారావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రవికుమార్, డాక్టర్ పాత్రుడు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎక్స్‌రే యంత్రాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

ఇంటర్ ఫలితాల్లో ఎసెంట్ విద్యార్థుల ప్రతిభ



కె.హర్షిణి, బైపీసీ(974)



తీడా మౌనిక, ఎంపీసీ(985)



బి.సౌమ్య, ఎంపీసీ(466)



ఆర్జి జిషిత, బైపీసీ(433)

మద్దిలపాలెం: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో ఎసెంట్ కళాశాల విద్యార్థులు ప్రతిభకనబరిచారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో 470 మార్కులకు 466 మార్కులతో బి.సౌమ్య సత్తా చాటినట్టు కళాశాల డైరెక్టర్లు తెలిపారు. బైపీసీ ప్రథమ సంవత్సరంలో 440 మార్కులకు ఆర్జి జిషిత 433 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో తీడా మోనిక 985 మార్కులు, ద్వితీయ సంవత్సరం బైపీసీలో కొట్టాన హర్షిణి 974 మార్కులు సాధించారన్నారు. ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరం 95.6 శాతం, ద్వితీయ సంవత్సరం 96.3 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. బైపీసీలో ప్రథమ సంవత్సరం 97.5 శాతం, ద్వితీయ సంవత్సరం 100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.